చీవాట్లు వేస్తే పూరుకున్నాడు. ఐనా ఇప్పటికీ, రోజు కొక్కసారైనా మీ బావను చేసుకోకపోయావా అంటాడుట.

మొన్న మా అన్నయ్య సినిమాకు వెళ్ళినప్పుడు తలవని తలంపుగా క్లాసుమేటు కనిపించి పలుకరించిందట. వెనుకటి స్నేహధోరణిగా, చనువుగా మాట్లాడారు. ఆ మాత్రానికే మా వదిన అతన్ని అపార్థం చేసుకొని ఎన్నో మాటలంది. నా భర్త మంచివాడే అన్న బలమైన నమ్మకం వున్నప్పుడు మాట్లాడితే మాత్రమేం అనుకోవద్దూ ?

మా స్నేహితురాలొకామె మెట్రిక్ చదివింది. చిన్నప్పుడే పెండ్లయింది. భర్త అనుమానపిశాచానికి అత్యంత ప్రియమిత్రుడు. పైగా కోపిష్టి. ఆమె పెద్దమ్మకొడుకు పక్కలో కూచున్నదని. ఎంత అన్న అయితేనేం ? పరాయి మగాడు కాదూ అని కొడితే ఆయన తండ్రివచ్చి ఆడపిల్లమీద అలా చెయి చేసుకోకూడదు నాయనా అన్నందుకు నా భార్యమీద నీకెందుకింత ఆపేక్ష, ఆమెకూ, నీకూ, ఏమి సంబంధం అని అడిగాడట. అప్పటినుంచి ఆ మానవుడు కోడలితో మాట్లాడిగాని, ఎదురుగా వచ్చిగాని, ఎరుగడు. మళ్ళీ భార్య పుట్టింటికొస్తే సుఖంగా వుంటుందట. పట్టుమని పదిరోజులైనా వుంచడు. మా స్నేహితురాలంటుంది. "అది ఆపేక్షో, అనుమానమో నాకేదీ, తెలియకుండా వుంది" అని. అపేక్షగల మగాడైతే పెద్ద, చిన్న తారతమ్యత లేకుండా అలాటి నోరు పట్టనిమాట లెందుకనవలసి వచ్చింది. ఒకోసారి ఇలాటిమాటలుపడలేక ఏనుయ్యో, గొయ్యో చూసుకున్నా చూసుకోవచ్చు.

ఒకరకం పురుషులున్నారు. కుడుందగ్గ నుంచి దేవతార్చనదాకా వారికే కావాలి పంచదార అయిపోయింది పట్టుకురండి అంటే అప్పుడే అయిపోయిందా ఎవరికి దానం చేశావు అంటారు.

కొందరు స్త్రీలకుకూడా ఇలాటి అనుమానమే వుంటుంది. జీతమంతా ఎవరికి పంపుతున్నాడో, ఎవరికొరకు ఖర్చు పెడుతున్నాడో అని. భర్త ఎంత సంపాదించినా తమకు, తమ పిల్లలకేగదా అనుకోరు. ఖర్మంకాలి ఒకో నెలలో స్నేహితుల్ని, సినిమాలకు గానీ, హోటల్ కు గాని తీసుకువెళ్ళాల్సి వస్తుంది. అలాటప్పుడు ఖర్చుపెట్టక తప్పుతుందా ! అదంతా ఎవరిముఖాన తగలేస్తున్నాడో అనుకుంటారు. అలాటి ఉద్దేశ్యం వాళ్ళకున్నప్పుడు మగవారు నిజం చెప్పినా నమ్మరు.

ఒకరిమీద ఒకరికి నమ్మకమనేది వుంటేనే ఆ సంసారం రాణింపుకొస్తుంది. నమ్మకమే లేకుంటే అదెలా బాగుపడుతుంది. భర్తను భార్య నమ్మాలి. భార్యను భర్త నమ్మాలి. మనిషిని మనిషి నమ్మకుంటే దెయ్యాం నమ్ముతుందా ! ఒకరిమీద ఒకరు అనుమానం పెట్టుకొన్నిమాటలతో చేష్టలతో హింసించుకుంటూ జీవితాన్ని, ముండపాదలా చేసుకునేకంటే,

# మీ అభిప్రాయం ఏమిటి?

క్షేమమ్మగారు గుంటూరునుంచి విశాఖపట్నంలోని తన కుమారుణ్ణి చూడాలనే ఉద్దేశంతో విశాఖపట్నం బయలుదేరింది. రైలు మెల్లగా బెజవాడ స్టేషనులో ఆగింది. స్వతహాగా క్షేమమ్మగారి నాలుక అర్ధనిముషంకూడా ఊరుకోదు. తను కూర్చున్న సెకండ్ క్లాస్ కంపార్టుమెంట్ లో ఇద్దరే ఇద్దరు స్త్రీలున్నారు. వారిద్దరూ కాలక్షేపానికి ఏవో పుస్తకాలు చదువుకుంటున్నారు. అర నిముషమైనా వేస్టు చెయ్యని క్షేమమ్మగారు వారిని మాట్లాడిద్దామా? వద్దా అని తటపటాయించింది.

ఇంతలో ఒకజంట సెకండ్ క్లాస్ కంపార్ట్ మెంట్ దగ్గర ఆగింది. ఆయువతి తన సూట్ కేస్ ను కంపార్ట్ మెంట్ లో పెట్టి తనతో ఉన్న యువకునితో "వస్తా రఘూ! నే వెళ్ళగానే లెటర్ రాస్తాను. నువ్వీలోపుగా ఒకసారి మేనేజరును కలుసుకో" అంటూ రైలు ఎక్కింది. గార్డు పచ్చజెండా ఊపాడు. రైలు ఒక్క కూతపెట్టి తూర్పువైపుగా ప్రయాణం సాగించింది. ఆ యువతి క్షేమమ్మగారికి ఎదురుగా ఉన్న సీటుమీద కూర్చున్నది.

క్షేమమ్మగారు ఎగాదిగా చూశారు ఆ యువతివైపు. ఆ అమ్మాయికి 20 ఏళ్ళుంటాయి. తెల్లగా నాజూగ్గా ఉన్నది. నుదుట నయాపైసంత బొట్టు పెట్టుకొంది.

నెమ్మదిగా ఆ యువతిని మాటల్లోనికి దించింది క్షేమమ్మగారు.

"ఎందాక వెళ్తున్నావమ్మా?"

"సామర్లకోట వెళ్తున్నానండి." ముక్తసరిగా జవాబిచ్చింది ఆ యువతి.

"నీ పేరేమిటన్నావ్ ?...అయినా యీకాలం పిల్లలపేర్లు మరీ నోరతిరగవమ్మా. నళినీట, వకుళట," ఇంకా, ఇంకా చిన్న లెక్చరిచ్చింది క్షేమమ్మ. "నా మతిమండ. ఇంతకీ నీ పేరేమిటో తెల్సుకోనేలేదే!" అంది చివరకు.

"నా పేరు వెంకటరవణండి."

"వెంకటరవణా! చక్కని పేరు. నీకు పెళ్ళి అయినదామ్మా?"

"అయిందండీ." సిగ్గుపడుతూ జవాబిచ్చింది రవణమ్మ.

"అనుకున్నానులే, నీ బొట్టూ అదీ చూస్తే. ఈ కాలం పిల్లలు చీమంత బొట్టు పెట్టుకొంటారు. ఏమి ఫేషనోనమ్మా."

"పెద్ద బొట్టు ఈ కాలం ఫేషన్ అని తెలియదు కాబోలు" అని రవణ మనస్సులో అనుకొని నవ్వుకొంది

"నీ వొక్కదానివే వస్తున్నావేమ్మా, మగవాళ్ళు రాలేదేం?"

"వారికి సెలవు యివ్వలేదండి"

"నీకు ఎంతమంది పిల్లలున్నారమ్మా?"

"నేనేమీ అనలేదండి...నాకు ముగ్గురు పిల్లలు."

"…ందమ్మా. ముచ్చటగా ముగ్గురు...మరి పిల్లలను తీసుకొని రాలేదేం?"

"వాళ్ళు తండ్రిని వదలి రారండి!"

"అవునులేమ్మా. ఈకాలం పిల్లలకి అమ్మదగ్గరకంటే నాన్నగారిదగ్గరే అలవాటు."

రైలు నెమ్మదిగా ఏలూరు స్టేషనులో ఆగింది. ప్లాట్ ఫారమంతా జనసమూహంతో కిటకిటలాడుచున్నది. రవణమ్మ తన సూట్ కేస్ ను చేతితో పట్టుకొని దిగుచు "ఏమండీ పిన్నిగారూ! నాకు పెళ్ళికాలేదండీ ఇంటర్ వ్యూకు పిలిస్తే వెళ్ళివస్తున్నానండీ. మీరు కాలక్షేపానికేవో అడిగారు, నేనేవో చెప్పాను. క్షమించండి" అంటూ దిగిపోయింది

"అరె బలే పిల్ల ! ఈ కాలం పిల్లలూ!" అంటూ ఒక నిట్టూర్పు విడిచింది క్షేమమ్మగారు.

—ఇ. నిర్మల, లక్ష్మి.

రచయిత్రులు ఈ సంఘటనకు 'కలికాలం పిల్లలు' అని పేరుపెట్టారు. ఇది కథలో అమ్మాయి వెంకటరమణమ్మ అలా పెద్దవాళ్ళ దగ్గర అబద్ధాలు చెప్పి హేళనచేయడం తగదన్న అభిప్రాయంతో. ఈకథ విన్న ఇంకొక అమ్మాయి దీనికి యీ శీర్షిక తగదంది. కొందరు పెద్దవాళ్ళు అపరిచితుల స్వంతవిషయాలన్నీ అడిగి ఇష్టంవచ్చినట్లు వ్యాఖ్యానాలు చేస్తారనీ అలాటివాళ్ళమీద ఇది విమర్శ కాబట్టి దీనికి 'శాస్తి' అని పేరుపెట్టాలనీ అంది.

మీ రేంపేరు పెడతారు ?